క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్‌కు మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సింహారావు బుధవారం తెలిపారు. నేటి నుంచి దరఖాస్తులు హైదరాబాద్ మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈనెల 19 వరకు సమర్పించాలని, పూర్తి వివరాలకు 040–23236112 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాలకు..

మహబూబాబాద్ అర్బన్: విదేశీ విద్యా పథకం కింద విదేశాలలో ఉన్నత చదువులు చదువుతున్న వారు ఉపకార వేతనాల కోసం జిల్లాలోని మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. జనవరి 2024 నుంచి జూలై 31 మధ్య కాలంలో స్ప్రింగ్ సీజన్ అడ్మిషన్ పొందిన అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. విద్యార్థికి స్కాలర్‌షిప్ ఆర్థికసాయం కింద రూ.20లక్షలు రెండు విడతల్లో చెల్లించబడుతుందన్నారు. విమాన ప్రయాణం రూ.60వేలు మించకుండా అందిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫాంలు 3 జతలు జిల్లా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 73966 91373– 98859 83942 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు



మహబూబాబాద్ రూరల్: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న అమరేందర్ రెడ్డి, భీమారెడ్డి పదోన్నతిపై ఎస్సైలుగా మహబూబాబాద్ జిల్లాకు వచ్చి బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బొకే, మొక్క అందజేశారు.

బెల్లయ్యనాయక్‌కు శుభాకాంక్షలు



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తేజావత్ బెల్లయ్యనాయక్ బుధవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బోడ రవినాయక్ బొకే అందజేసి అందించిన శుభాకాంక్షలు తెలిపారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం



కురవి: అక్రమంగా తరలిస్తున్న రూ.3.50లక్షల విలువైన నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు. బుధవారం సీరోలు మండలం చింతపల్లి శివారులోని జాతీయ రహదారి సీరోలు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీ చేస్తుండగా టాటా ఇంట్రా వాహనంలో 32.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 3.50 క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నారు. కురవి మండలం బీబీనాయక్ తండాకు చెందిన మాలోత్‌రమేష్, బోడ రాజు, బోడ అనిల్, ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన డ్రైవర్ తీరుబిదుల తరుణ్, మహబూబాబాద్ మండలంలోని వీరారం తండాకు చెందిన భూక్య రవీందర్‌లు ఏపీలోని రాజమండ్రి నుంచి నల్లబెల్లం, పటికను సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి తీసుకొచ్చి చుట్టుపక్కల తండాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. మాలోత్ రమేష్, బోడ రాజు, తరుణ్‌లను పట్టుకుని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామను. భూక్య రవీందర్, బోడ అనిల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాం కుమార్ పేర్కొన్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో రెగ్యులర్ టీచర్లను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాష్, కన్వీనర్ కమిటీ సభ్యులు జ్యోతిబసు కోరారు. మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యల గురించి ఆరా తీశారు. 120 మంది విద్యార్థులకు 8మంది ఉపాధ్యాయులే ఉన్నారని, వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, కన్నా, ప్రశాంత్, కిశోర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.నాగన్న డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, నాలుగు కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో స్నేహ బిందు, సుధాకర్, విక్రమ్, దుర్గారావు, కోటేశ్వర్‌రావు, రవి, సేవ్యా, వెంకన్న, రవి, రాజేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సాధియాసుల్తానాకు వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లతీఫ్, వసంత, మల్లికాంబ, సరిత, ధనలక్ష్మి, సరోజ, శ్రీను పాల్గొన్నారు.

తొర్రూరు: కార్మిక హక్కులను కాలరాసేలా కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జమ్ముల శ్రీను తెలిపారు. బుధవారం నిరసన తెలిపి, డీటీ నర్సయ్య, సీడీపీఓ హైమావతిలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సాంబయ్య, దర్గయ్య, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం మండల కార్యదర్శి జల్లె జయరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్కే సలీమా, రజిని, నిర్మల, జ్యోతి, సుగుణ, దేవేంద్ర, రజిత, కనకలక్ష్మి పాల్గొన్నారు.



మహబూబాబాద్: ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు



బయ్యారం: ఆందోళనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు



కేసముద్రం: ధర్నా చేస్తున్న కార్మికులు, అంగన్‌వాడీలు



కురవి: అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు



డోర్నకల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మల్లేశం, తదితరులు



పెద్దవంగర: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కనీస వేతనాన్ని అమలు చేయాలి

కురవి: కార్మికులకు కనీస వేతనం పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, కాశేశ్వరీ, సుజాత, కళమ్మ, నిర్మల, కౌసల్య, అనిత పాల్గొన్నారు.

గార్ల: కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకురాలు సీహెచ్ మౌనిక, కార్మికులు వీరస్వామి పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం అశవర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు అందోళన చేశారు. అనంతరం డీటీ సంజీవకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కమిటీ అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి శ్రీలత, రజిత, స్వరూప, విజయ, ధనమ్మ పాల్గొన్నారు.

నెల్లికుదురు: సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

డోర్నకల్: కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం కోరారు. కార్మికుల కోర్కెల దినాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలతో పాటు కార్మికులందరి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దారు కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, సంధ్యాకుమారి, చాంది, రాములమ్మ, సుగుణమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పెద్దవంగర: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు స్వరూప, మండల అధ్యక్షురాలు మంజుల అన్నారు. తహసీల్దార్ మహేందర్‌కు తమ న్యాయమైన సమస్యలను నెరవేర్చాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంధ్యారాణి, ఝాన్సీ, సరళ, యాకలక్ష్మి, ఇందిర, విజయలక్ష్మి, అండాలు, నీలవేణి, చంద్రకళ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో ఆశవర్కర్లు తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు బుధవారం వినతిపత్రం అందించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. సైదమ్మ, పుష్ప, విజయ పాల్గొన్నారు.

12న విద్యుత్ లోక్ అదాలత్

డోర్నకల్: ఈనెల 12న డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ కురవి సబ్‌డివిజన్ ఏడీఈ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డోర్నకల్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసే కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం, ఓల్టేజీ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఆర్థికసాయం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని తూర్పు తండా మాజీ సర్పంచ్ అజ్మీర సరిత భర్త కృష్ణ ఇటీవల మృతిచెందాడు. బుధవారం దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, సీతామహాలక్ష్మి దంపతులు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్ రూ.25 వేలు, ముత్యా వెంకన్న గౌడ్, ఆవుల వెంకన్న చెరో రూ.25 వేలు, లూనావత్ అశోక్, విజయ్, చంద్రారెడ్డి, యాదగిరి చెరో రూ.5వేలు, ముగ్గురు మాజీ సర్పంచులు రూ.15 వేలు, శ్రీను, మురళీ గౌడ్ చెరో రూ.2,500 ఆర్థికసాయాన్ని అందజేశారు.

డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు తక్కువ చార్జీలతో యూనిఫాం కుట్టిన మహిళా టైలర్లకు పాఠశాలకు చెందిన స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఉపాధ్యాయులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎన్.అప్పిరెడ్డి, హెచ్ఎం నర్సింహారావు, మహిళా గ్రూపు లీడర్ హైమ, ట్రస్టు సభ్యులు మంజులత, శ్రీనివాస్, వసంతరాణి, దమయంతి పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన జిలకర అనురాధ అనే ఇంటర్ విద్యార్థిని ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈమేరకు బుధవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సమ్మయ్యగౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.3వేల ఆర్థికసాయం, 50కేజీల బియ్యాన్ని అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు భూలోక్‌రెడ్డి, బాలాజీరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

శిఖం భూమిని స్వాధీనం చేసుకోవాలి

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమిని కబ్జా చేసిన భూ ఆక్రమణదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రవీందర్‌ను చెరువు శిఖం భూమి విస్తీర్ణం వివరాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గార్ల పెద్దచెరువు శిఖం భూమి సుమారు 400 ఎకరాల్లో ఇప్పటికే సుమారు 150 ఎకరాలు శిఖం భూమి కబ్జాకు గురైందన్నారు. ప్రతీఏటా కొందరు వ్యక్తులు జేసీబీల ద్వారా రాత్రి సమయంలో భూకబ్జాకు పాల్పడుతున్నా, సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్యాస్, విద్యుత్ సబ్సిడీలు రాక మండలంలో అనేక మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంపాల శ్రీను, నాగమణి, దేవా, రాము, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

నెల్లికుదురు: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నేడు పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి కార్మికులను కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని మేజరాజుపల్లిలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు సూర్యం, యాకయ్య, సాయిలు, యాదగిరి, ముత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థి బద్దం సత్తిరెడ్డి చొరవతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ మహబూబాబాద్ సర్కిల్ బాధ్యులు మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు రూ.60వేల విలువైన స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. యూనియన్ బాధ్యుల సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సీహెచ్.శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఆర్.శ్రీరామ్, వైస్ ప్రెసిడెంట్ వై.సతీష్ కుమార్, బి.సత్తిరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.శాండిల్య, ఎం.శ్రీనివాస్, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్‌బీఐ స్టాఫ్

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



పెద్దవంగర: సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో విధులు నిర్వహించిన హెచ్ఎం శిరీష, ఉపాధ్యాయుడు రమేష్ ఇటీవల బదిలీ అయ్యారు. ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. పాఠశాలను వీడుతున్న ఉపాధ్యాయులను విద్యార్థులు చుట్టుముట్టారు. తమ పాఠశాలలోనే ఉండాలని పట్టుబట్టి కన్నీళ్లు పెట్టుకోగా ఉపాధ్యాయులు వారికి నచ్చజెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్ కుమార్, జెడ్పీ హెచ్ఎం లీలావతి, హెచ్ఎం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రణతి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుమాధవ్, సీఆర్పీ రంగయ్య, అంబిక, కవిత, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా హెచ్ఎం వెంకటరాజయ్య మాట్లాడుతూ.. మారుమూల గ్రామీణ పాఠశాల అయినప్పటికీ, పాఠశాల పేరును నిలబెట్టడంలో వారు పడిన శ్రమను కొనియాడారు.

సంక్షిప్త సమాచారం

ఆపద వస్తే సమాచారం ఇవ్వాలి



కురవి: ఎవరికైనా ఆపద వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన చట్టాలను తీసుకొచ్చిందని వివరించారు. బాలికలకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. ఎదురైన వెంటనే 100 ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కురవి ఎస్సై బైరు గోపి, ఏఎస్సై సదయ్య, హెచ్ఎం ఎండీ వాహిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.యాకూబ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోవర్ధన్, సంఘం నాయకులు హరినాయక్, శ్రీనావాస్, రాంజీ, రాజశేఖర్, భరత్ కుమార్, వీరబ్రహ్మం, సోమేశ్వర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డులన్నింటిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది చేపట్టిన దోమల నివారణ మందు పిచికారి పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, నాయకులు యశోధర్‌జైన్, వాజిద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గూడూరు: మండలంలోని బొల్లెపల్లికి చెందిన బానోతు రాంచందర్ అయోధ్యపురం పెట్రోల్‌పంపులో బుధవారం పెట్రోల్ పోసుకొని వస్తున్నాడు. ఎదురుగా వచ్చిన లైన్‌తండాకు చెందిన తేజావత్ నితిన్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు కిందపడ్డారు. రాంచందర్ చేయి విరిగింది. నితిన్ తలకు తీవ్ర గాయమైంది. ఇరువురిని వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

సన్మానం

గూడూరు: పదవికాలం పూర్తయిన గూడూరు మండల వైస్ ఎంపీపీ ఆరె వీరన్నతోపాటు ఏడుగురు ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యుడిని బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బోడ కిషన్, రాధిక, ప్రవలిక, కో ఆప్షన్ రహీంపాష కవిత పాల్గొన్నారు.

బియ్యం అందజేత

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పగిండ్ల కొమురయ్య ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన మోహన్ 50 కేజీల బియ్యం అందించాడు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

తొర్రూరు: పెరిగిన టెక్నాలజీ ఫొటోగ్రఫీ రంగాన్ని దెబ్బతీసిందని, ఆర్థికంగా చితికిన ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేరుగు కరుణాకర్ అన్నారు. అసోసియేషన్ డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బుధవారం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మాచర్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి కాసర్ల రవికుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

తొర్రూరు: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు నలమాస వీరస్వామి బుధవారం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. మోకు జారి కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పరిశుభ్రత పాటించాలి

గూడూరు: ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ యమున అన్నారు. మండలంలోని మట్టెవాడ శివారు దట్టమైన అడవిలోని దొరవారి తిమ్మాపురం గ్రామంలో బుధవారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

వైద్యశిబిరం

దంతాలపల్లి: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని జేసీఎం ప్రార్థన మందిరం ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయం యాండ్ హోప్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, వైద్యులు సంపత్, సిద్ధార్థ, స్నేహలత, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



తొర్రూరు: వారసత్వ వీఆర్ఏలకు వెంటనే నియామక పత్రాలు అందించాలని సంఘ నాయకులు కొండ ఉప్పలయ్య కోరారు. ఈ మేరకు బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారసత్వ వీఆర్ఏలు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ భూక్యా భాస్కర్(54) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన భద్రమ్మ(వీఆర్ఏ) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిన్నారిని ఢీకొన్న కారు..

● పరిస్థితి విషమం.. ఎంజీఎంకు తరలింపు

మహబూబాబాద్ రూరల్: జాతీయ రహదారిపై అతి వేగంగా వెళ్తున్న కారు ఢీకొని చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన సంద సురేష్, సునీత దంపతుల పెద్ద కూతురు గాత్రిక, చిన్న కూతురు చార్లిక నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు జాతీయ రహదారిపై బస్‌స్టాండ్ ప్రాంతంలో డివైడర్ దాటుతుండగా నర్సంపేట వైపునకు వెళ్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి చార్లికను, రహదారి పక్కన నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. గాయపడిన చార్లికను స్థానికులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ ఆసుపత్రిలో చిన్నారికి వైద్యం అందించాక ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి ఘటన స్థలానికి వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోట గ్రామానికి చెందిన రెడ్డిబోయిన రాజుగా పోలీసులు గుర్తించారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా గ్రామంలస్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు రాస్తారోకో చేశారు. వాహనాలు స్తంభించాయి. దీంతో గ్రామస్తులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగి స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. మండల పంచాయతీ అధికారి హరిప్రసాద్ వచ్చి జాతీయ రహదారి పక్కన, ఇతర ప్రాంతాల్లో ఇబ్బందికరంగా ఉన్నచోట్ల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న చార్లిక



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

‘డీఎస్సీ’ గడువు పెంచాలి

గార్ల: డీఎస్సీ పరీక్షల గడువును 3నెలలు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, కట్టా రమేష్, ఎస్‌కె పాషా, కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖదీర్, రాధాకృష్ణ, గాజుల గణేష్ పాల్గొన్నారు.

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష తేదీపై పునరాలోచించుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో తహసీల్దార్ సాధియా సుల్తానాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, అనిల్‌యాదవ్, యాకయ్య, సంపత్ పాల్గొన్నారు.

‘చిన్నపాటి వర్షానికి బురదమయం’

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ వద్దకు వెళ్లే రహదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారింది. ఈమేరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తండావాసులు బురదరోడ్లుపై నిలబడి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కురవి సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి సామ పాపన్న, గ్రామస్తులు లచ్చిరాం, హష్లా, హర్జ, పూనం ఈర్య, చందు, రామారావు, బిమ్లా, మోహన్, కేత, నరేష్ పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు